క్లుప్తంగా

కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో గల శ్రీదత్తకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా లోకకల్యాణార్థం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు ధ్యానమందిరంలో రుద్రహోమం నిర్వహించారు. భక్తులు ఆలయంలో గల శివలింగానికి ప్రత్యేక పూజలు చేసి రుద్రహోమంలో పాల్గొన్నారు. మహిళలు లలితా సహస్రనామ స్తోత్రపారాయణం చేసి కుంకుమార్చన చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



వనపర్తి రూరల్: మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి కురుమయ్య, ఎస్‌ఐ బాలయ్య తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ప్రజ్వల సీడ్స్, శ్రీ వాసవి సీడ్స్, మన గ్రోమర్ , రైతు సేవా ట్రేడర్స్, కిసాన్ మిత్రా ,లక్ష్మీనరసింహ్మా ట్రేడర్స్ దుకాణాలలో లైసెన్స్, రిజిస్టర్లు అలాగే విత్తనాల నిల్వలను తనిఖీ చేసి రశీదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ వైర్లకు మంటలు



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం వైర్లపై చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. మంటలు చెలరేగి దాదాపు పది నిమిషాల పాటు వైర్లపై మంటలు రగిలాయి. దీంతో సమీపంలోని ఇళ్లలో ఫ్రిడ్జ్‌లు, టీవీలు కాలిపోయాయని గ్రామస్తులు తెలిపారు. కరెంటు వైర్ల వద్ద మంటలు చెలరేగడంతో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వగా.. వనపర్తి నుంచి గోపాల్‌పేటకు చేరుకుని కరెంటు సరి చేశారు. సుమారు రెండు గంటలు కరెంటు పోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు



ఖిల్లాఘనపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మంగళవారం ఎంఈఓ జయశంకర్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 21వేల పాఠ్యపుస్తకాలు అవసరం కాగా.. ప్రస్తుతం 18,500 పుస్తకాలు వచ్చాయన్నారు. మిగతా 2,500 పుస్తకాలు జూన్ 12 లోపు వస్తాయని తెలిపారు. మండలానికి వచ్చిన పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. హెచ్‌ఎంలు పుస్తకాలను పాఠశాల్లో భద్రపరిచి పాఠశాలలు ప్రారంభం అయిన వెంటనే విద్యార్థులకు అందించాలని సూచించారు.

రమాబాయికి ఘన నివాళి

వనపర్తిటౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి వర్ధంతిని పురస్కరించుకొని మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్, గిరిరాజాచారి, గంధం నాగరాజు, కావలి బాలస్వామినాయుడు, రాచాల యుగంధర్‌గౌడ్, వెంకటయ్య గౌడ్, నరసింహయాదవ్, మందకృష్ణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



రైతుకో ‘విశిష్ట’ సంఖ్య

- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో కీలకం
- మండలంలో వివరాల నమోదు నత్తనడక
- కేవలం 5 శాతమే నమోదు



పాన్‌గల్ రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదులో వ్యవసాయ అధికారులు

పాన్‌గల్: అన్నదాతలకు విశిష్ట సంఖ్య కేటాయించడంతో పాటు కార్డు సైతం ఇచ్చి పథకాల అమలుకు అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలన్న సంకల్పంతో ఈ దిశగా అడుగేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు ‘అగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ ఈ రిజిస్ట్రీ’లో రైతుకు ఉన్న భూముల వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రక్రియ పూర్తయ్యాక 11 అంకెల ప్రత్యేక సంఖ్య (యూనికోడ్)ను కేటాయిస్తారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూమి యజమానుల వివరాలను సదరు రైతు ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయడం ద్వారా ఫార్మర్‌ఐడీ కేటాయిస్తారు. ఈ వానాకాలంలో ప్రధాన మంత్రి కిసాన్ యోజన కింద అందించే పెట్టుబడి సాయాన్ని దీని ప్రాతిపదికనే చెల్లించనున్నారు.

మండలంలో 19,754 మంది రైతులు

మండలంలోని 28 పంచాయతీల్లోని క్లస్టర్లలో మొత్తం 19,754 మంది రైతులు ఉన్నారు. ప్రతి క్లస్టర్‌లో రిజిస్ట్రీ ప్రక్రియ ఈ నెలలోనే ప్రారంభమైంది. వచ్చే నెల రెండో వారంలోగా ఆయా రైతుల వివరాలను నమోదు చేయాలన్నది లక్ష్యం. ఈ మేరకు ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణాధికారులు తమ పరిధిలోని గ్రామాలకు వెళ్లి భూమి వివరాలు నమోదు చేయాలి. ఇందుకు రైతులు తమ ఆధార్ కార్డు, పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్‌తో అనుసంధానమైన సెల్‌ఫోన్ నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి వచ్చే ఓటీపీ నంబర్ ఆధారంగా నమోదు పూర్తవుతుంది.

నమోదు నెమ్మదిగా..

‘ఫార్మర్ రిజిస్ట్రీ’ నమోదు ప్రక్రియలో పలు సమస్యలు ఎదరవుతున్నాయి. వాటిపై అవగాహన లేని ఏఈఓలతో అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు. చాలా మంది రైతుల సెల్‌ఫోన్లకు ఓటీపీ రావడం లేదు. ఆధార్‌కు అనుసంధానం చేసిన ఫోన్ నంబర్‌ను వాడకపోవడమే ఇందుకు కారణం .ఇప్పటివరకు మండలంలో కేవలం 5 శాతం మాత్రమే నమోదైనట్లు అధికారులు పేర్కొంటున్నారు.

అవగాహన కల్పించాలి



అన్నదాతలకు కేటాయించే విశిష్ట సంఖ్య ఫార్మర్ రిజిస్ట్రీపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలి. దీంతో పాటు ఆధార్‌కార్డుకు అనుసంధానం ఉన్న ఫోన్ నంబర్ ప్రస్తుతం వాడకం పోవడం, ప్రస్తుతం వాడుతున్న ఫోన్ నెంబర్ ఆధార్‌కార్డుకు అనుసంధానం లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

– నాగన్ననాయక్, రైతు, తెల్లరాళ్లపల్లితండా

ఏఈఓలు పర్యటించాలి



ఏఈఓలు వారికి కేటాయించిన క్లస్టర్ల పరిధిలోని గ్రామాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ పథకాల వివరాలను రైతులకు తెలియపర్చాలి. ఏఈఓలు రైతు వేదికలకే పరిమితం అవుతుండటంతో ప్రతి పనికి రైతులు మండల కేంద్రాకే రావాల్సి వస్తుంది.

– ఎనుముల స్వామి, రైతు, పాన్‌గల్

వివరాలు నమోదు చేస్తున్నాం



భూమి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకుంటే పదకొండు నంబర్ల యూనిక్ కోడ్ కేటాయిస్తారు. ఇది కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు కోసం ఉపయోగపడుతుంది. ఏఈఓలు ప్రస్తుతం ధాన్యం కాంటాకు సంబంధించి టోకన్ల జారీలో బీజీగా ఉండటంతో ఫార్మర్ రిజిస్ట్రీపై దృష్టి సారించడం లేదు. టోకన్ల జారీ పూర్తికాగానే నమోదు ప్రక్రియలో వేగం పెంచుతాం. ఆధార్‌కార్డుకు అనుసంధానమైన ఫోన్ నెంబర్ లేని వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

– రాజవర్ధన్‌రెడ్డి, ఏఓ, పాన్‌గల్

మామూళ్లు ఇస్తేనే పనులు!

- రేషన్‌కార్డులో వివరాలు నమోదు ‘కావాలన్నా.. తొలగించాలన్నా..
- లేకుంటే పెండింగ్‌లోనే దరఖాస్తులు



రేషన్ కార్డు దరఖాస్తును చూపుతున్న పీర్లానాయక్

పాన్‌గల్: నూతన రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేస్తుండటంతో కార్డులు లేని వారు, కార్డులో పేర్లు నమోదు చేసుకునే వారు మీసేవ కేంద్రంలో దరఖాస్తులు చేసుకుంటున్నారు. మీసేవ కేంద్రంలో దరఖాస్తులు చేసిన వారి వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటే సిబ్బంది మామూళ్లు ఇస్తేనే వివరాలను నమోదు చేస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మామూళ్లు ఇవ్వని వారి వివరాలను నమోదు చేయకుండా పెండింగ్‌లో పెడుతున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. కార్యాలయంలో సిబ్బంది ప్రతి పనికి ఎంతో కొంత ముట్టజెప్పాల్సిందేనట. నూతన రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసి నెల రోజులు దాటినా వివరాలను నమోదు చేయడం లేదని మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన గిరిజనుడు మంగళవారం తన గోడును విలేకరులకు వివరించాడు. విషయంపై డీటీ అశోక్‌కుమార్‌ను వివరణ కోరగా.. సిబ్బంది మామూళ్లు వసూలు చేస్తున్నారనే విషయం తమ దృష్టికి రాలేదని, బాధితులు ఎవరైనా ఉంటే రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

నెల నుంచి తిరుగుతున్నా..

నూతన రేషన్ కార్డు మంజూరుకు మీసేవ కేంద్రంలో ఏప్రిల్ 21న దరఖాస్తు చేసుకున్నా. దరఖాస్తు చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కార్యాలయ సిబ్బందికి సూచించినా.. మామూళ్లు ఇస్తేనే ఫైల్ ముందుకు వెళ్తుందని వివరాలు నమోదు చేయకుండా పెండింగ్‌లో పెట్టారు. నెల రోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు తమ గోడు పట్టించుకోవట్లేదు. అధికారులు స్పందించి సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటూ పేదల ఇబ్బందులు తొలగించాలి.

– పీర్లానాయక్, తెల్లరాళ్లపల్లితండా

సాగుపై రైతులకు అవగాహన

పాన్‌గల్: మండలంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు వానాకాలం పంటల సాగుపై సూచనలు, విత్తనాలు, ఎరువుల ఎంపికపై రైతులకు అవగాహన కల్పించినట్లు ఏడీఏ చంద్రశేఖర్, ఏఓ రాజవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. విత్తన శుద్ధి, అధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు.

పంచాచార్య యుగమానోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



గోపాల్‌పేట: అమావాస్యను పురస్కరించుకొని మండల కేంద్రంలోని చంద్రగుండ మఠంలో చంద్రశేఖర మహాస్వాములవారి జీవ సమాధికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి గణపతి పూజ, స్వామివారి మూలవిరాట్‌కు ఏకవార రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, నివేదన మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జూన్ 16న నిర్వహించే పంచాచార్య యుగమానోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ విశ్వేశ్వరయ్య స్వాముల వారి ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కోడేరు: రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రాజాపూర్‌లో సీపీఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈనెల 30న కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తునట్లు ధర్నాకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నర్సింహ, కమిటీ సభ్యులు రవి, వెంకటమ్మ, శివశంకర్, కాంటం లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలి

పెద్దకొత్తపల్లి : గ్రామాల్లోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు చేర్పించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం వేడుకరావుపల్లి తండాలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. తండాలో మూతపడ్డ పాఠశాలలు తెరిపించేందుకు విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయులు కృష్ణ, మహేష్‌బాబు, గౌస్‌పాషా, మల్లయ్య, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతో పాటు ముష్టిపల్లి, కల్వకోలు, చంద్రకల్ గ్రామాల్లో మంగళవారం సబ్సిడీపై జీలుగ విత్తనాలను వ్యవసాయ అధికారి శిరీష పంపిణీ చేశారు. విత్తనాలు కావల్సిన వారు రైతులు పట్టాదారు పాస్‌బుక్, అకౌంట్ బుక్, ఆధార్‌కార్డు తీసుకొని రైతులు రావాలని సూచించారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి




చందాపురంలో కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న మెంటేపల్లి పురుషోత్తంరెడ్డి

వనపర్తి రూరల్: ప్రభుత్వ సమన్వయ లోపం వల్ల ధాన్యం సేకరణలో ఆలస్యం కావడంతో అకాల వర్షాలకు పూర్తిగా తడిసిపోయిందని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు మెంటేపల్లి పురుషోత్తంరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చందాపూర్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో కలిసి ధాన్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి నెల రోజులు గడుస్తున్నా తూకం వేసి మిల్లుకు తరలించడంలో అధికార యంత్రాంగం విఫలమైందని దుయ్యబట్టారు. అధికారులు, నిర్వాహకుల సమన్వయ లోపం వల్ల, తూకాలు వేసి, బస్తాలను మిల్లుకు తరలించడంలో జాప్యం జరుగుతుందన్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి మొలకలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సందా వెంకటేష్, నాయకులు బాలరాజు, నరసింహ, పెంటయ్య, వెంకటేష్, సంపత్‌కుమార్, డాకేష్, తిమ్మయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తరుగు పేరిట మిల్లర్ల దోపిడీ అరికట్టాలి

రైతులతో సేకరిస్తున్న ధాన్యాన్ని మిల్లుకు తరలించాక తరుగు పేరిట మిల్లర్లు దోపిడి చేస్తున్నారని, ఆ దోపిడిని అరికట్టి రైతులను ఆదుకోవాలని మంగళవారం పెబ్బేరు మండల, పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురళీగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గౌని వేమారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కంచె ఆంజనేయులు, నాయకులు రఘు, గోవిందునాయుడు, రామకృష్ణ, చిరంజీవి, శ్రీధర్ పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికే ప్రాధాన్యం



అన్నారంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఏర్పాటుపై చర్చిస్తున్న నాయకులు

పాన్‌గల్: పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు తప్పక ప్రాధాన్యత ఇస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మల్లాయిపల్లి, చింతకుంట, మాందాపూర్, రాయినిపల్లి, తెల్లరాళ్లపల్లి, కేతేపల్లి, అన్నారం గ్రామాల్లో పర్యటించి నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి గ్రామ కమిటీలు ఏర్పాటు చేశారు. నూతన గ్రామ కమిటీలు, స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ వచ్చే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో విండో డైరెక్టర్ ఉస్మాన్, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ విండో వైస్ చైర్మన్ భాస్కర్‌యాదవ్, యూత్ అధ్యక్షుడు గిరిబాబు, పుల్లారావు, జయరాములుసాగర్, దర్గయ్య పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలు గోదాంలకు తరలించాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సాక్షి ఎఫెక్ట్..



తెల్లరాళ్లపల్లిలో రైతులతో మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్లు

పాన్‌గల్: ‘లారీలు రాలే.. కేంద్రాల్లోనే ధాన్యం’ అనే శీర్షికన సాక్షి దినపత్రికలో మంగళవారం వచ్చిన వార్తకు స్పందించి రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మండలంలోని రేమద్దుల, తెల్లరాళ్లపల్లి వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రేమద్దుల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలను గ్రామంలోని ఫాతీమా రైస్ మిల్లులో నిల్వ చేసేలా ఏర్పాట్లు చేశామని, కేంద్రాల నుంచి ధాన్యం బస్తాలను తరలింపులో లారీలు రాక జాప్యం అవుతుందని, దీంతో ఆయా గ్రామాల్లో ఉండే ట్రాక్టర్ల ద్వారానే ధాన్యం చేరవేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ముసురు వర్షాలు, హమాలీలు రాక ధాన్యం తరలింపులో ఇబ్బందులు అవుతున్నాయని, వాటిని అధిగమిస్తూ ధాన్యం సేకరణ, బస్తాల నిల్వల తరలింపులో వేగవంతం చేసి రైతుల ఇబ్బందులను తొలగిస్తామన్నారు. కేంద్రాల్లో ధాన్యం సేకరణ, బస్తాల తరలింపు వివరాలను ప్రతి రోజు నివేదించేచాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. అంతకుముందు మండల కేంద్రంలో ధాన్యం బస్తాలు నిల్వ చేసే గోదాంను సందర్శించి, లారీల కాంట్రాక్టర్‌తో లారీలను కేంద్రాలకు పంపడంలో జరుగుతున్న జాప్యంపై ఆరా తీశారు. కేంద్రాల్లోని రైతుల సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారు స్పందించేలా చేసిన సాక్షి దినపత్రికకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

గోదాం పరిశీలన

వీపనగండ్ల: కొనుగోలు కేంద్రాల నుంచి గోదాంల వద్దకు తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయాలని జాయింట్ కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంను ఆయన పరిశీలించారు. వరిధాన్యపు నాణ్యతను పరిశీలించడంలో ఆలస్యం అవుతుందని, సరైన సిబ్బంది లేకపోవడమే ఇందుకు కారణమని రైతులు 3 రోజులుగా అధికారులకు విన్నవిస్తున్నారు. వర్షాలు రోజురోజుకూ అధికమవుతుండడంతో టార్పాలిన్ కవర్లను ఏర్పాటు చేసుకోవాలని జేసీ రైతులకు సూచించారు. మండల స్థాయి అధికారులు తరచూ కొనుగోలు కేంద్రాలతో పాటు గోదాం వద్ద ఎలాంటి సమస్య ఏర్పడ్డా వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తహసిల్దార్ వరలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



వీపనగండ్లలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ డాకేశ్వర్‌గౌడ్

పాన్‌గల్: ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రశీదులు అందించాలని ఏడీఏ చంద్రశేఖర్ ఫర్టిలైజర్ డీలర్లకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో పోలీసులతో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, గడువు తీరిన ఎరువులు, విత్తనాలు, పెస్టిసైడ్స్ విక్రయించి రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవన్నారు. ధరలకు సంబంధించిన వివరాలను దుకాణం ముందు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, హెచ్‌సీ యాదగిరి పాల్గొన్నారు.

వీపనగండ్ల: నకిలీ విత్తనాలను అమ్మే ఫర్టిలైజర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల టాస్క్‌ఫోర్స్ టీం హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుతో కలిసి మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, భవానీ ట్రేడర్స్, శ్రీసాయి ట్రేడర్స్, క్రాంతి ఫర్టిలైజర్స్ దుకాణాలను వారు తనిఖీ చేశారు. నిల్వ ఉంచిన విత్తనాల రిజిస్టర్లు, వాటి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసే రైతులకు రసీదు అందించాలన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



అచ్యుతాపురం ఆంజనేయ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఖిల్లాఘనపురం వీరన్నగుట్ట వద్ద..

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గుట్టపై ఉన్న ఆలయంలో స్వామివారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింది భాగాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వనపర్తి రూరల్: మండలంలోని అచ్యుతాపురం గ్రామంలోని గుంటి పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు నవీన్‌కుమార్ శర్మ మంగళవారం ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చన, నైవేద్యం, మహామంగళహారతి, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జగత్‌పల్లికి చెందిన దయానంద్‌గౌడ్, కళావతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో నరేందర్‌స్వామి, రమేష్‌శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

‘రాజీవ్ యువ వికాసం’ దరఖాస్తులపై ఆరా



మదనాపురంలో దరఖాస్తులపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



ఆత్మకూర్‌లో..

మదనాపురం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై ఎంపీడీఓ ప్రసన్నకుమారితో చర్చించారు. మండలానికి మంజూరైన యూనిట్లు, గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులపై ఎమ్మెల్యేకు వివరాలు సేకరించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు పేదలందరికి చేరాలని సూచించారు.కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పల్లె ప్రశాంత్, నాయకులు జగదీష్, కృష్ణవర్ధన్‌రెడ్డి, ఎంపీఓ ఉసేనప్ప, అధికారులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు త్వరలోనే ఇంటర్వ్యూలు

ఆత్మకూర్: త్వరలోనే రాజీవ్ యువవికాసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక వేగవంతం చేయాలని, ఎంపికైన వారు ఇంటి నిర్మాణాలు చేపట్టే విధంగా అవగాహన కల్పించాలని మండల ప్రతేకాధికారి ప్రవీణ్ కుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 220 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 187 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి కలెక్టర్‌కు నివేదించామన్నారు. తిప్పడంపల్లిలో మాత్రమే ఇందిరమ్మ కమిటీ సభ్యులు జాబితాను ఇవ్వలేదన్నారు. దేవరపల్లిలో 82 ఇళ్లు మంజూరు కాగా 32 ఇళ్ల పునాది వరకు పూర్తయ్యాయని, 16 మందికి రూ.లక్ష చొప్పున ఖాతాల్లో జమయిందని, రెండో విడతగా రూ.2 లక్షల బిల్లులు వారంలోగా పడతాయన్నారు. అలాగే రాజీవ్ యువ వికాసానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యర్థుల నుంచి 1,095 దరకాస్తులు వచ్చాయని, 282 యూనిట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు పార్వతమ్మ, విజయ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాల గ్రామానికి చెందిన గందం చంద్రకళకు మంజూరయిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరాజు, నరేందర్‌రెడ్డి బాధితురాలికి అందించారు. కార్యక్రమంలో నరసింహ, పెద్ద శాంతయ్య, బాలయ్య, కురుమయ్య, సత్తిరెడ్డి, కరుణాకర్, కేశపాగ చందు తదితరులు పాల్గొన్నారు.